క్లుప్తంగా

విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు


మునగపాక శాఖా గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : వేసవి విజ్ఞాన తరగతులను సద్విని యోగం చేసుకోవాలని మునగపాక శాఖా గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం మునగపాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఇటువంటి శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ నిరసన


నేవీ ప్రహరీ నిర్మాణంతో కలుగుతున్న నష్టాల వివరాలను పేపర్‌పై చూపుతున్న రైతులు

రాంబిల్లి : నేవీ ప్రహరీ నిర్మాణంతో నష్టపోతున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ పెదకలవలపల్లి గ్రామ రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నేవీ ప్రహరీ నిర్మాణంతో కలుగుతున్న నష్టాలను వివరిస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. పశువుల పాకలను వెళ్లే దారి లేకుండా ప్రహరీ నిర్మించడం, అంతేగాక ఈ ప్రహరీ కారణంగా రైతులు తమ పశువులను కొండపై మేపుకొనే అవకాశం లేకుండా పోయిందని మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు


ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

కోటవురట్ల: గ్రామీణ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ సర్కారు బడులకు కీర్తిని తీసుకొస్తున్నారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో సత్తా చాటిన పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దుబాసి యశస్విని, మళ్ల చర్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ వెంకట రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దాంతో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు పట్టుదలగా కృషి చేయాలన్నారు.

ఉరుములు, పిడుగులతో భారీ వర్షం


దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట/దేవరాపల్లి/కె.కోటపాడు/గొలుగొండ/మాడుగుల రూరల్: పలు ప్రాంతాల్లో బుధవారం ఈదురు గాలులు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండకాసింది. అనంతరం కారుమబ్బులు కమ్ముకుని ఉరుములు మెరుపులతో పాటు పెద్దపెద్ద శబ్దాలతో పిడుగులు పడ్డాయి. పొలాల్లో పనులు చేసుకునే రైతులు పశువులు కాసే కాపరులు, కూలీలు పిడుగుల శబ్దానికి హడలిపోయారు. ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయపడ్డారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న వేళ భారీ వర్షం కురవడం పట్ల అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి నారు మడుల తయారీకి ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈవో-2 శ్రీజోష్


చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు వై.వెంకటరమణ, స్థానిక గ్రంథాలయాధికారి కె.జనార్దన్ అన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకృతికి మానవునికి ఉన్న సంబంధాన్ని విద్యార్థులకు వివరించారు. చెట్ల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మోటారు వాహనాల వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణానికి హాని కలిగించే పనులు చేయడం మానుకోవాలని, వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ చేయడం భావి తరాలకు మంచి ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలని సూచించారు. మనిషికి జీవన ప్రమాణాలను పెంపొందించే అంశాలను వివరించారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడే పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మనుగడ

కోటవురట్ల : పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మనుగడ సాధ్యమవుతుందని ఎంఈవో-2 శ్రీజోష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో-2 శ్రీజోష్ మాట్లాడుతూ ప్రత్యేక కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ మొక్కను నాటడం అలవాటుగా చేసుకోవాలన్నారు. రోజు రోజుకు పల్లెలు సైతం కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయని, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, కృష్ణ, వీరబాబు, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మునగపాక : విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మునగపాక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీవల్లి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం మండలంలోని అరబుపాలెం గ్రామంలో బైఫ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బైఫ్ సంస్థ ప్రతినిధులు నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


తాము గీసిన బొమ్మలతో విద్యార్థులు

ప్రకృతి వనరులను సంరక్షించాలి

యలమంచిలి రూరల్ : ప్రకృతి వనరులను నిత్యం సంరక్షించాలని,కలుషితం లేని గాలి, నీరును భావి తరాలకు అందించడానికి అందరూ కలిసి నడవాల్సిన అవసరం ఉందని మైహోమ్ సిమెంటు కర్మాగారం సీనియర్ ప్రెసిడెంట్ (వర్క్స్) వీహెచ్.చౌదరి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం కర్మాగారం ఆవరణలో కార్మికులు, ఉద్యోగులతో కలిసి ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మానవ తప్పిదాల వలన అనేక రకాలుగా పర్యావరణ కాలుష్యం జరుగుతోందన్నారు. స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ పీఆర్వో వెంకటేష్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



మైహోం సిమెంటు కర్మాగారం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉద్యోగులు

అనితను కలసిన మండలపార్టీ అధ్యక్షులు


ఎమ్మెల్యే అనితను కలసి అభినందనలు తెలుపుతున్న మండల పార్టీ అధ్యక్షులు

నక్కపల్లి : పాయకరావుపేట ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన వంగలపూడి అనితను బుధవారం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం కలిసారు. ఈ సందర్భంగా అనితను సత్కరించారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనంత మెజార్టీతో విజయం సాధించడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. తన గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకొంటున్నానని, ప్రతి గ్రామంలో పర్యటించి అందరికీ కృతజ్ఞతలు చెబుతానని అనిత పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యాభివృద్ధికి పీటీఐ కుమారి సేవలు అభినందనీయం


గణపర్తి హైస్కూల్ పీటీఐ కమలకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : విద్యాభివృద్ధికి గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ పీటీఐ (పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్) కమలకుమారి సేవలు అభినందనీయమని ఎంఈవో-2 శివనాయుడు అన్నారు. మండలంలోని గణపర్తి హైస్కూల్‌లో పీటీఐగా 7 సంవత్సరాల పాటు పనిచేసిన కమలకుమారికి బుధవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాయుడు మాట్లాడుతూ కమలకుమారి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు కర్రి లక్ష్మీనారాయణ, బి.అచ్యుతకృష్ణ, ఆర్.సత్తిబాబు, ఎం.గోవింద, సిబ్బంది వెంకటరావు, రామలక్ష్మి, రమణాజీ, వీరప్పారావు పాల్గొన్నారు.

వానొస్తే వరదే...


కొరుప్రోలు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై వర్షపునీరు


కొరుప్రోలు కాలనీకి వెళ్లే రోడ్డుపై చెరువును తలపిస్తున్న నీరు

ఎస్.రాయవరం : మండలంలో వర్షం కురిస్తే వరదే అన్నట్టుగా మారుతోంది. మండల వాణిజ్య కేంద్రం అడ్డురోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మాణాలు చేసి, వర్షపు నీరు పోయే మార్గం లేక ఏమాత్రం వర్షం కురిసినా రోడ్లు, కాలువలు, లోతట్టు ప్రాంతాలు చెరువులుగా మారుతున్నాయి. అదేక్రమంలో కొరుప్రోలు సమీపంలో ఆర్అండ్‌బీ , కొరుప్రోలు ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు తరుచూ సమస్యగా మారుతోంది. సైతారుపేట జంక్షన్ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ఇదే సమస్యతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పెదఉప్పలం గ్రామం ముఖద్వారం వద్ద ఇదే సమస్య నెలకొని ఉంది. ఇకనైనా మండల అధికారులు పర్యవేక్షించి తరచూ సమస్యగా మారుతున్న రహదారులపై నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.


అడ్డురోడ్డు జంక్షన్‌లో కాలువలా ప్రవహిస్తున్న నీరు

మలేరియాపై అప్రమత్తం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి, వైద్య సిబ్బంది

రోలుగుంట: మలేరియా పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ధనలక్ష్మి తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా రోలుగుంటలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. దోమ పుట్టొద్దు-దోమ కుట్టొద్దు, దోమలను అరికడదాం-మలేరియా నుంచి విముక్తి పొందుదాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధి కారి మాట్లాడుతూ దోమల నివారణకు అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ సాజహాన్, పీహెచ్ఎన్ వరహాలమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, స్టాఫ్ నర్స్ సుజాత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నియంత్రణ

అనకాపల్లి: వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణిజగదీశ్వరి తెలిపారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాసోత్సవాలను ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో మలేరియాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దోమల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ఇంటి ముందున్న కాలువలో చెత్తచెదారం వేయకూడదని, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల్లో నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. గంబూజియా, గప్పి అనే చిన్నచిన్న చేపల్ని నీటి స్థావరా(బావులు, కుంటలు)ల్లో వదిలితే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఇంటిపై ఉన్న ట్యాంకులకు మూతలు అమర్చాలని, లేకుంటే దోమలు గుడ్లుపెట్టి, రోగాలకు కారణమవుతాయని పేర్కొన్నారు. దోమల బారి నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు వాడాలని సూచించారు. దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో, వీధుల్లో ఫాగింగ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.మంగమ్మ, బి.సంఘం తదితరులు పాల్గొన్నారు.


దోమల నివారణ చర్యల్ని వివరిస్తున్న వైద్యురాలు వాణిజగదీశ్వరి


చింతలపాలెంలో మలేరియా నివారణ అవగాహన ర్యాలీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

కశింకోట: మలేరియా వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతలపాలెంలో బుధవారం మలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మలేరియాకు కారణమైన దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు. వారానికి ఒక సారి నిల్వ నీటిని తొలగించి డ్రైడే పాటించాలన్నారు.

ఓటరు మహాశయులకు ధన్యవాదాలు

- ప్రజాతీర్పు శిరసావహిస్తా..
- నియోజకవర్గంలో అందుబాటులో ఉంటా..
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంబాల జోగులు


కంబాల జోగులు

నక్కపల్లి : ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓట్లేసిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకొంటున్నానని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో జగనన్న రాజాం నుంచి తనను ఇక్కడకు పంపించారన్నారు. ఈ ఎన్నికల్లో తనకు 75వేల పైచిలుకు ఓట్లేసిన నాలుగు మండలాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకొంటున్నానన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమకు ఓటు వేసిన 700 పైగా ఉద్యోగులకు కూడా తన కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. నియోజకవర్గంలోనే అందుబాటులో ఉంటానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. డీబీటీ, నాన్‌డీబీటీ పథకాల ద్వారా జగనన్న ప్రభుత్వం దాదాపు 3 లక్షల కోట్ల రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసారన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ఇంత సంక్షేమం చేసినా ప్రజలు ఆదరించకపోవడం బాధాకరమన్నారు. ఫలితాలపై సమీక్ష చేసుకుంటామన్నారు. ఎక్కడ లోపాలున్నాయి అనేదాన్ని గుర్తించి సరి చేసుకోవడం జరుగుతుందన్నారు. ఇక నుంచి ప్రజల్లోనే ఉంటూ వారు ఎదుర్కొంటోయే సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామన్నారు. గెలుపోటములు సహజమేనని, మళ్లీ అవకాశం కోసం ప్రయత్నిస్తామన్నారు. అధికారంలోకి రాబోయే ప్రభుత్వం తాము ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చవలసి ఉందని, ఈ విషయంలో లోపాలు జరిగితే ప్రజల తరఫున నిలబడటానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

సత్యనారాయణ మాస్టారు సేవలు చిరస్మరణీయం


సత్యనారాయణ మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక గౌతమ పఠన మందిరంలో బుధవారం స్వర్గీయ మందపాటి సత్యనారాయణ మాస్టారు మృతికి సంతాప కార్యక్రమం నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులను తీర్చిదిద్దిన సత్యనారాయణ మాస్టారు ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు పఠన మందిరంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షుడు దాడి సూరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే సత్యనారాయణ మాస్టారు వన్నె తెచ్చారన్నారు. స్కౌట్స్‌లో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మందిర సభ్యులు మారిశెట్టి అప్పారావు, వెలగా శ్రీనివాసరావు, దాడి అప్పలనాయుడు,ఆడారి లక్ష్మణరావు,ఆడారి పరశురామ్, కుంది సూర్యనారాయణ, కాశీ, ఆడారి సన్యాశిరావు, బూడిద శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పద్య పఠనంపై విద్యార్థులకు అవగాహన


విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పద్య పఠనంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

పాయకరావుపేట : విద్యార్థులకు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ముఖ్యంగా పుస్తక పఠనం, పద్యాలు రాయడం, చదవడం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామమూర్తి ప్రతి రోజూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పురాణ ఇతిహాసాలు చదవడం, వ్యాఖ్యానించడం, వ్యాయామం, క్రీడలు తదితర అంశాలపై శిక్షణ కల్పిస్తున్నారు. క్రీడల్లో ఖోఖో ఆటలు ఆడిస్తున్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లిషు అనర్గళంగా చదవడం, మాట్లాడడంపై అవగాహన కల్పిస్తున్నారు. స్పోర్ట్ గేమ్స్, భగవద్గీత, రామాయణం, భాగవతం వంటి పురాణాలు కూడా పఠించాలన్నారు. శ్లోకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. ఇందులో భాగంగా బుధవారం పద్యాలు చదవడంపైన అవగాహన కల్పించారు. విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి చదువుకోవడం కోసం సభ్యత్వాలు నమోదు కార్యక్రమం గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ప్రారంభించారు. పలువురు విద్యార్థులు సభ్యత్వాలను చెల్లించారు.


విద్యార్థులకు గ్రంథాలయంలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్ నూకినాయుడు భారతదేశంలో గల ముఖ్య నదులు పై అవగాహన కల్పించారు. నదులు ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థులు నీతి కథలు చదివారు. అనంతరం పలు ఆటలను ఆడించారు. కాగా గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ వేసవి శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు.


దిమిలి గ్రంథాలయంలో నీతి కథలు చదువుతున్న విద్యార్థులు

వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: వృద్ధుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సినియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో అసోసియేషన్ సీనియర్ ప్రతినిధి కేవీ గౌరీపతి ఆధ్వర్యంలో విజయనగరం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల వృద్ధులకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు షుగర్ పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు వైద్యుల సూచనల మేరకు సకాలంలో మందులు వాడాలని సూచించారు. 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి విల్లూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎంబీవీ స్వామి, సహాయ కార్యదర్శి మహేశ్వరరావు, సీనియర్ సభ్యులు కేఎం నాయుడు, కె.వీరభద్రరావు, తమ్మిరాజు, కె.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం చిన్నారులకు కథలు చెప్పారు. ఈ శిబిరంలో భాగంగా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటలు వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ ఉద్యోగి వి.శ్రుతి తెలిపారు.